PRGI NO:TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

తెలంగాణ | సోమవారం 12-10-2026 | సంపుటి: 01 | సంచిక : 274 | పేజీలు : 12

## "పురుగుల మందు తాగలేదా?"

రైతుపై అమానవీయ వ్యాఖ్యలు.
గజ్వేల్ తహసీల్దార్ సస్పెండ్.
సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో.
కలెక్టర్ విచారణ.. ప్రాథమిక నివేదికతో చర్యలు.




**జనం వాయిస్, సిద్దిపేట, అక్టోబర్ 11:**

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, సమస్యతో తన వద్దకు వచ్చిన రైతుపై అమానవీయంగా వ్యాఖ్యలు చేసిన గజ్వేల్ తహసీల్దార్ చిట్టంపల్లి స్వామిపై సస్పెన్షన్ వేటు పడింది. భూ వివాదం పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చిన రైతును ఉద్దేశించి "ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?" అంటూ ప్రశ్నించినట్లు ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఘటనపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి విచారణకు ఆదేశించారు. రెవెన్యూ అధికారుల ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గజ్వేల్ మండలం మక్త మాసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యేసు, ప్రాంతీయ వలయ రహదారి భూసేకరణ పరిహారానికి సంబంధించి తన బంధువులతో నెలకొన్న వివాదంపై మాట్లాడేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. - మిగతా 2 లో...

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

# తేదీ, సమయం చెప్పు

రామచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతి సవాల్.
ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం.
అర్హులైన ఓటర్లకు అన్యాయం జరిగిందంటున్న కాంగ్రెస్.
ఎన్నికల సంఘం చర్యలను సమర్థిస్తున్న బీజేపీ.





**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

తెలంగాణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయంగా దుమారం రేపుతోంది. ఓటరు జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తుండగా, బోగస్, మరణించిన, నకిలీ ఓట్లను తొలగించడంలో భాగంగానే ఈ ప్రక్రియ సాగిందని బీజేపీ నేతలు సమర్థిస్తున్నారు. - మిగతా 2 లో...

## ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో కలకలం

పవర్ బ్యాంక్ నుంచి మంటలు..
శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్.
విమానంలో పొగలు రావడంతో ప్రయాణికుల్లో ఆందోళన.
అప్రమత్తమైన సిబ్బంది.. మంటలు అదుపులోకి.
ప్రయాణికులు, సిబ్బంది క్షేమం.



2

## ఆఫ్రికా తీరంలో పెను విషాదం.

109 మంది మృతి.
జిబౌటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా బోల్తాపడిన పడవ.
మృతుల్లో 15 మంది చిన్నారులు.. మరో 116 మంది గల్లంతు.
80 మందిని రక్షించిన అధికారులు.



2

## హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా

# ట్రాఫిక్ జామ్

- దసరా సెలవులతో పెరిగిన వాహనాల రద్దీ.
- లక్కారం నుంచి ధర్మోజీగూడెం వరకు వాహనాల బారులు.
- చౌటుప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో ఇబ్బందులు.
- ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచన.

2



# భారీ పెట్టుబడులే లక్ష్యం

డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0.
డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు.
ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ.
జీసీసీలు, కృత్రిమ మేధ, ఏరోస్పేస్ రంగాలపై ప్రత్యేక దృష్టి.

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. 'తెలంగాణ రైజింగ్' దార్శనికతలో భాగంగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుంది.

2



## కపిలేశ్వరపురంలో చిరంజీవి.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రశంసలు.
రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని వ్యాఖ్య.
పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ పనితీరుపై ప్రస్తావన.
వైద్య కేంద్రాన్ని ప్రారంభించిన మెగాస్టార్.
క్యాన్సర్‌పై అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై కీలక సూచనలు.

2



## రూ.5 లక్షల ఉచిత బీమా.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
తెలంగాణ ప్రజలకు డబుల్ బొనాంజా.
నవంబర్ 19న ఇందిరమ్మ బీమా, రాజీవ్ యువ వికాసం పథకాల ప్రారంభం.
రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు బీమా రక్షణ కల్పించే లక్ష్యం.
కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక సాయం.
బీమా ప్రీమియం పూర్తిగా ప్రభుత్వమే చెల్లింపు.




2

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ఢిల్లీ-చెన్నై ఇండిగో విమానంలో కలకలం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

ఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్తున్న ఇండిగో విమానంలో పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగడంతో కలకలం రేగింది. విమానం గాల్లో ఉండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది భద్రతా పరికరాలతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. విమానం సురక్షితంగా దిగడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఇండిగో విమానం 6E6115 ఢిల్లీ నుంచి చెన్నైకి బయలుదేరింది. ప్రయాణం కొనసాగుతుండగా, ఓ ప్రయాణికుడికి చెందిన పవర్ బ్యాంక్ నుంచి ఓవర్‌హెడ్ లగేజీ కంపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగినట్లు సమాచారం. అక్కడి నుంచి పొగలు వెలువడటాన్ని గమనించిన క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించారు. విమానంలో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలను ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విమానం లోపల పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో ఆందోళన నెలకొంది. అయితే సిబ్బంది తక్షణమే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పైలట్ విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. విమానం అక్కడ సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్ కావడంతో అందరూ ఊరట చెందారు. ఈ ఘటనలో ప్రయాణికులు, విమాన సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ఇండిగో సంస్థ వెల్లడించినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పవర్ బ్యాంక్‌లో సాంకేతిక లోపం ఏర్పడిందా? బ్యాటరీ వేడెక్కడం వల్ల మంటలు చెలరేగాయా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. పవర్ బ్యాంక్ తయారీ సంస్థ, దాని పరిస్థితి, మంటలు వ్యాపించిన తీరుపై వివరాలు సేకరిస్తున్నారు. లిథియం-అయాన్ బ్యాటరీలతో పనిచేసే పవర్ బ్యాంకులు దెబ్బతిన్నప్పుడు లేదా అధికంగా వేడెక్కినప్పుడు అగ్నిప్రమాదాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల విమాన ప్రయాణాల్లో పవర్ బ్యాంకుల విషయంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. విమానయాన సంస్థలు సూచించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. బ్యాటరీలతో పనిచేసే పరికరాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, పొగలు లేదా అసాధారణ వేడి కనిపిస్తే వెంటనే విమాన సిబ్బందికి తెలియజేయాలి. ఈ ఘటన విమాన ప్రయాణాల్లో భద్రతా నిబంధనల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేసింది.

# ఆఫ్రికా తీరంలో పెను విషాదం.

**జనం వాయిస్, అంతర్జాతీయం, అక్టోబర్ 11:**

ఆఫ్రికా తీరంలో ఘోర పడవ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ సముద్రంలో బోల్తా పడటంతో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతైనట్లు అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) వెల్లడించింది. అక్టోబర్ 8, 9 తేదీల మధ్య రాత్రి జిబౌటి నుంచి యెమెన్‌కు సుమారు 350 మందితో బయలుదేరిన పడవ, ఒబాక్ పట్టణానికి ఉత్తరాన గుహెరే ప్రాంతం సమీపంలో ప్రమాదానికి గురైంది. ఇప్పటివరకు 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారుల మృతదేహాలను గుర్తించారు. ఈ ప్రమాదం నుంచి 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడ్డారు. వారంతా ఇథియోపియా దేశస్థులని ఐఓఎం తెలిపింది. వీరిలో 64 మందికి సహాయ కేంద్రంలో ఆశ్రయం కల్పించి అవసరమైన సహాయం అందిస్తున్నారు. గల్లంతైన వారి కోసం జిబౌటి అధికారులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనపై ఐఓఎం ప్రతినిధి అలెగ్జాండర్ కోయిసాక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో వలసదారులు ఎంచుకుంటున్న సముద్ర మార్గం అత్యంత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొన్నారు. 2025లో ఈ మార్గంలో 900 మందికి పైగా వలసదారులు మరణించడం లేదా గల్లంతవడం గమనార్హం. తాజా ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# "పురుగుల మందు తాగలేదా?"

- మొదటి పేజీ తరువాయి..

గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌తో కలిసి తహసీల్దార్ చిట్టంపల్లి స్వామిని కలిశారు. ఈ సందర్భంగా రైతు తన సమస్యను వివరిస్తుండగా అధికారి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. రైతును ఉద్దేశించి "ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?" అని ప్రశ్నించినట్లు వీడియోలో నమోదైంది. తాను ఉద్దేశపూర్వకంగానే అలా అన్నానా అని ప్రశ్నించగా, అవునంటూ అధికారి సమాధానం ఇచ్చినట్లు కూడా వీడియోలో కనిపించింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తహసీల్దార్ తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రైతుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ ఘటనపై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రాథమిక విచారణ నిర్వహించి, తహసీల్దార్ ప్రవర్తన సరికాదని నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని కూడా ఆదేశించారు. కాగా, ఈ ఘటన ఐదు నుంచి ఆరు నెలల క్రితం జరిగినదని రైతు యేసు మరో వీడియోలో వెల్లడించారు. తన భూ వివాదం అనంతరం పరిష్కారమైందని, పరిహారం డబ్బులు కూడా తన బ్యాంకు ఖాతాలో జమయ్యాయని తెలిపారు. అయితే ఘటన పాతదైనా, అధికారిపై ఉన్న ఆరోపణలు, వైరల్ అయిన వీడియో నేపథ్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారితో గౌరవంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

# ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా.. తేదీ, సమయం చెప్పు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

తెలంగాణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయంగా దుమారం రేపుతోంది. ఓటరు జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తుండగా, బోగస్, మరణించిన, నకిలీ ఓట్లను తొలగించడంలో భాగంగానే ఈ ప్రక్రియ సాగిందని బీజేపీ నేతలు సమర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేసిన సవాల్‌కు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. తేదీ, సమయం చెబితే ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తానని ప్రతి సవాల్ విసరడంతో ఇరు పార్టీల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగిపోయిన ఒక్క ఓటరునైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజల ముందుకు తీసుకురాగలరా అని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే బోగస్, మరణించిన, ఒకటికంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించిందని పేర్కొన్నారు. ఈ చర్యలను ఓటు చోరీగా అభివర్ణించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించలేదని కూడా విమర్శించారు. రామచందర్‌రావు వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ఓటు కోల్పోయిన ఒక్కరినైనా చూపించాలని సవాల్ చేస్తున్నారని, తేదీ, సమయం చెబితే బాధితులను తీసుకొస్తానని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లు, తెలంగాణలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు తొలగించారంటూ ఆయన ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లు ఎక్కువగా తొలగిపోయాయని విమర్శించారు. ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్, బీజేపీ మధ్య కొనసాగుతున్న ఈ మాటల యుద్ధం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు కాంగ్రెస్ అక్రమాలపై విచారణ జరిపి అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తుండగా, మరోవైపు బీజేపీ ఎన్నికల సంఘం చర్యలను సమర్థిస్తోంది. మంత్రి పొన్నం విసిరిన ప్రతి సవాల్‌కు రామచందర్‌రావు ఎలా స్పందిస్తారు? బాధిత ఓటర్లను ప్రజల ముందుకు తీసుకొస్తే బీజేపీ తన వైఖరిని ఎలా సమర్థించుకుంటుంది? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# భారీ పెట్టుబడులే లక్ష్యం

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. 'తెలంగాణ రైజింగ్' దార్శనికతలో భాగంగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుంది. దేశీయ, విదేశీ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించి భారీ పెట్టుబడులను సాధించడంతోపాటు, గతంలో కుదిరిన ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించనుంది. తెలంగాణను పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. గత ఏడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు కొనసాగింపుగా ఈసారి పూర్తిగా పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ విధానాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించి, కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని యోచిస్తున్నారు.

**లక్ష్యాలకు భారీ పెట్టుబడులు అవసరం**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' ప్రకారం 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాల సాధనకు పెద్ద ఎత్తున దేశీయ, విదేశీ పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆధునిక సాంకేతిక రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలపడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త పారిశ్రామిక విధానం 2.0తోపాటు ప్రపంచ సంస్థల సామర్థ్య కేంద్రాలు (జీసీసీలు), సమాచార కేంద్రాలు, కృత్రిమ మేధ, విమానయాన, రక్షణ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, జీవశాస్త్ర ఆధారిత పరిశ్రమల కోసం ప్రత్యేక విధానాలను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. 'మీ పెట్టుబడికి మా భరోసా' అనే నినాదంతో పెట్టుబడిదారులకు భరోసా కల్పించి, తెలంగాణలో వ్యాపార విస్తరణకు ప్రోత్సాహం అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

**గత సదస్సులో రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు**

2025 డిసెంబర్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజుల్లో సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం వెల్లడించింది. పునరుత్పాదక ఇంధనం, విమానయానం, ఔషధాలు, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. 44 దేశాలకు చెందిన 154 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. గత సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడి హామీలను పరిశ్రమల స్థాపనగా మార్చడం, ఒప్పందాల అమలులో పురోగతిని సమీక్షించడం ఈసారి కీలక అంశాలుగా ఉండనున్నాయి.

**ప్రత్యేక ప్రోత్సాహకాలపై దృష్టి**



ఈసారి జీసీసీలు, సమాచార కేంద్రాలు, కృత్రిమ మేధ, విమానయాన, రక్షణ రంగాలు, ఎలక్ట్రానిక్స్, జీవశాస్త్ర ఆధారిత పరిశ్రమల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. 25 మిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. జపాన్, మధ్యప్రాచ్య దేశాలు, స్విట్జర్లాండ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని ప్రభుత్వం ఆశిస్తోంది. మొత్తంగా, గత సదస్సులో వచ్చిన పెట్టుబడి హామీలను ముందుకు తీసుకెళ్లడంతోపాటు కొత్త సంస్థలను తెలంగాణకు తీసుకురావడం, అధునాతన పరిశ్రమల విస్తరణకు అవకాశాలు కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించుకున్న దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల దిశగా ఈ సమావేశం ఎంతమేరకు పెట్టుబడులను ఆకర్షిస్తుంది, ఒప్పందాలు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితాలను అందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 11:**

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి-65పై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఆదివారం సెలవు కావడంతో పలువురు కుటుంబ సమేతంగా సొంత వాహనాల్లో విజయవాడ వైపు బయలుదేరడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి అధికమైంది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. ముఖ్యంగా లక్కారం నుంచి ధర్మోజీగూడెం వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చౌటుప్పల్ వద్ద నిర్మాణ పనులతో ఇబ్బందులు**

చౌటుప్పల్ పురపాలక పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయి. నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనాలు ఇరుకైన సర్వీసు రహదారుల మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో రాకపోకలకు ఆటంకాలు



ఏర్పడుతున్నాయి. వాహనాలు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రహదారిపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి**

ట్రాఫిక్ రద్దీ కారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణానికి అదనపు సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరం ఉంది. వీలైనంతవరకు ప్రయాణాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొందరపడి వాహనాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయకుండా, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచిస్తున్నారు.

**అధికారులు చర్యలు తీసుకోవాలి**

దసరా పండుగ సమయంలో వాహనాల రద్దీ పెరగడం సాధారణమే అయినప్పటికీ, ఈసారి నిర్మాణ పనులు, వాహనాల అధిక సంఖ్య కారణంగా ప్రయాణికుల ఇబ్బందులు మరింత పెరిగాయి. ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణను పటిష్ఠం చేసి, వాహనాలు సాఫీగా వెళ్లేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పండుగ సెలవుల్లో ప్రయాణించే వారు రహదారిపై పరిస్థితులను ముందుగా తెలుసుకుని బయలుదేరితే అనవసరమైన ఆలస్యాన్ని కొంతవరకు నివారించవచ్చు.

# కపిలేశ్వరపురంలో చిరంజీవి.

**జనం వాయిస్, తూర్పు గోదావరి:**

మెగాస్టార్ చిరంజీవి ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ పాలనపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందని పేర్కొన్నారు. చాలా కాలం తర్వాత రాష్ట్రానికి వచ్చిన తాను ప్రజలతో మాట్లాడి పాలనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలో అనేక మంచి మార్పులు చోటుచేసుకున్నాయని ప్రజలు చెప్పినట్లు వివరించారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మంచి జరగాలని ఆకాంక్షించారు. తూర్పు గోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎస్ఎల్ ఆసుపత్రి, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్మించిన వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులతో ముచ్చటించిన ఆయన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడారు. ముఖ్యంగా తన సోదరుడు పవన్ కల్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ పనితీరును ప్రస్తావించారు. గతంలో దేశవ్యాప్తంగా 23వ స్థానంలో ఉన్న ఈ శాఖ ప్రస్తుతం మొదటి స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. ఈ మార్పు గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు.

**క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాలి**

వైద్య కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఆరోగ్య పరిరక్షణపై చిరంజీవి కీలక సూచనలు చేశారు. చాలామంది క్యాన్సర్ వ్యాధి ముదిరిన తర్వాతే దాని తీవ్రతను గుర్తిస్తున్నారని, ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి పరీక్షలు చేయించుకుంటే చికిత్స ద్వారా కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తన భార్య, సోదరి, తల్లికి క్రమం తప్పకుండా క్యాన్సర్ పరీక్షలు చేయిస్తానని వెల్లడించారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.



**ఆరోగ్యంపై మరింత శ్రద్ధ**

నటుడు మురళీమోహన్ ఆరోగ్య పరిస్థితిని చూసిన తర్వాత తాను కూడా ఆరోగ్యంపై మరింత శ్రద్ధ తీసుకోవడం ప్రారంభించానని చిరంజీవి తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులపై అవగాహన పెంచుకోవడం, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక సమస్యలను ప్రారంభంలోనే గుర్తించవచ్చని వివరించారు.

**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి**

ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని కూడా చిరంజీవి ప్రస్తావించారు. ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా గాజు బాటిళ్లను వినియోగించేందుకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. హైదరాబాద్ నుంచి గాజు నీటి బాటిళ్లను తీసుకువస్తానని వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.

**అభిమానుల సందడి**

కపిలేశ్వరపురం పర్యటనకు వచ్చిన చిరంజీవికి మెగా అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆయనను చూసేందుకు స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల ఛైర్మన్ గన్ని భాస్కరరావు, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జీవీబీ చౌదరి, పలువురు మంత్రులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.5 లక్షల ఉచిత బీమా.

**జనం వాయిస్, ఖమ్మం, అక్టోబర్ 11:**

తెలంగాణ ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే ఇందిరమ్మ బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. అదే రోజున రాజీవ్ యువ వికాసం పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రెండు పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు యువతకు అవకాశాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కుటుంబానికి ప్రధానంగా ఆదాయం సమకూర్చే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా ఆదుకోవడమే ఇందిరమ్మ బీమా పథకం ముఖ్య ఉద్దేశమని భట్టి విక్రమార్క తెలిపారు. అర్హత కలిగిన కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా చెల్లించనుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ పథకం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మంలో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతి నెలా ఆరు కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా 72 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నామని, గృహజ్యోతి పథకం కింద 53 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. చేయూత పింఛన్ల ద్వారా 43 లక్షల మందికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కోటి 6 లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య సాయం అందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా 12.5 లక్షల మంది విద్యార్థులకు సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను కూడా ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ బీమా, రాజీవ్ యువ వికాసం పథకాలను నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో వాటి అమలుపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇందిరమ్మ బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఎలా ప్రయోజనం కల్పిస్తారు, లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి నిబంధనలు ఉంటాయి, బీమా సాయం పొందేందుకు అనుసరించాల్సిన విధానం ఏమిటనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పథకం అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వెలువడిన తర్వాత అర్హతలు, దరఖాస్తు విధానం వంటి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

PRGI NO:TGTEL/26/A0383
డైనమిక్ జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# ఎరుకల జోలికొస్తే ఖబర్దార్..!

- తాట తీస్తాం - ఎరుకల సంఘం హెచ్చరిక.
- "జనం వాయిస్" కథనాలకు స్పందన.. నిరుపేద కుటుంబానికి ఎరుకల సంఘం అండ!.
- 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న గుడిసెను కూల్చే ప్రయత్నాలను సహించేది లేదు.
- బాధిత కుటుంబానికి భరోసా.. రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి.
- బాధితులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి.
- తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరాస్వామి.



**కురవి, అక్టోబర్ 11 (జనం వాయిస్):**

నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలంటూ "జనం వాయిస్" దినపత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు స్పందన లభించింది. మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన నిమ్మశెట్టి వెంకన్న కుటుంబానికి తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా ప్రతినిధులు అండగా నిలిచారు. శుక్రవారం ప్రచురితమైన కథనంపై స్పందించిన సంఘం నాయకులు శనివారం బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్న "జనం వాయిస్" దినపత్రిక యాజమాన్యానికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరాస్వామి మాట్లాడుతూ.. ఎరుకల జాతికి చెందిన నిరుపేద కుటుంబాల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిమ్మశెట్టి వెంకన్న కుటుంబం ఒంటరిదనే భావనతో భయభ్రాంతులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని, బాధిత కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంకన్న తండ్రి సుమారు 50


జనం వాయిస్
పన్ను రసీదులున్నా అండలేని అభాగ్యుడు
- కురవిలో ఎరుకల కార్మికుడి గుడిసె కూల్చివేత యత్నం!
- ఏకలవ్య వారసుడి ఆక్రందన.
- సంఘాల మౌనం వెనుక అంతర్యమేమిటి?
- ఆర్థిక, రాజకీయ బలంలేని వారిని వదిలేస్తారా..?
- "ఎరుకుల సంఘం" నాయకులు ఏమైనట్లు? వారి గొంతు ఎందుకు మూగబోయింది?
- ఉన్న గుడిసెను కూడా కాపాడుకోలేని దుస్థితి.. ఇదేనా సామాజిక న్యాయం!?

'బాధితుడి ఆక్రందన' ప్రత్యేక కథనం
కురవి, అక్టోబర్ 9 (జనం వాయిస్):

ఏళ్ల క్రితమే గుడిసె వేసుకొని అక్కడ నివాసం ఉంటున్నారని, తమ వాదనకు మద్దతుగా గ్రామ పంచాయతీ ఇంటి పన్ను రసీదు, విద్యుత్ కనెక్షన్, మిషన్ భగీరథ పథకం కింద నల్లా కనెక్షన్ వంటి ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధారాలు ఉన్న కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడటం, వారి నివాస స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడం తగదని అన్నారు.

### నివాసాల మధ్య బాంబుల పేలుళ్లపై ఆందోళన

నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాల మధ్య బాంబులు పేల్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం స్పందించాలని వీరాస్వామి డిమాండ్ చేశారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం చేయాలని బాధితుడు నిమ్మశెట్టి వెంకన్న ప్రజావాణి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని భయపెడుతూ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నా వ్యక్తులపై, విచారణలో వాస్తవాలు నిర్ధారణ అయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించే అంశాలపై విచారణ జరిపి, చట్టప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు.

### దాడులను సహించేది లేదు

ఇటీవల నిమ్మశెట్టి వెంకన్న కుటుంబానికి మద్దతుగా వచ్చిన వారిపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలను ఎరుకల సంఘం నాయకులు ఖండించారు. న్యాయం కోసం నిలబడే వారిని భయపెట్టడం, దాడులకు పాల్పడటం సరికాదని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలి

రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి నివాస స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని ఎరుకల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇరు పక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణ లేకుండా బాధితులపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం బక్కయ్య, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు ఆర్. సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాగం మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రాగం రామచంద్రు, వార్డు సభ్యుడు రాగం వీరభద్రం, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షుడు కృష్ణ, అంగడి రవీందర్, నిమ్మశెట్టి మురళి, ఉపేందర్, అంగడి నర్సయ్య, మాజీ వార్డు సభ్యురాలు అంగడి సోమమ్మ, కోటయ్యతో పాటు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సారంగపల్లి మలుపు వద్ద రోడ్డు ప్రమాదం..
# సింగరేణి కార్మికుడికి గాయాలు

**జనం వాయిస్, మందమర్రి: అక్టోబర్ 11:**

మందమర్రి మండలం సారంగపల్లి మలుపు సమీపంలో ఆదివారం ఉదయం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో సింగరేణి కార్మికుడు రమేష్ కాలికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాకేష్, పైలట్ వినయ్ ఘటనాస్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రమేష్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# తత్య తండా గ్రామ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వంకుడోత్ నగేష్ ఎన్నిక.

**కురవి, అక్టోబర్ 11 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తత్య తండా గ్రామ పంచాయతీలో ఎస్టీ సెల్ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ సూచనల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో ఎస్టీ సెల్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా గోపా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు లునవత్ హేమా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తత్య తండా గ్రామ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వంకుడోత్ నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భూక్యా గోపా నాయక్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో ఎస్టీ సెల్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ (డాక్టర్ సెల్) డాక్టర్ వీరన్న నాయక్, మండల నాయకులు గార్లపాటి భరద్వాజ్, బాధవత్ వీరన్న, బోడ లక్ష్మణ్ నాయక్, భూక్యా సీతారాం, భూక్యా దేవుసింగ్, జాటోత్ రవీందర్, తేజావత్ వీరన్న, భూక్యా వీరన్న, తేజావత్ సక్రం, లునవత్ వెంకన్న, తేజావత్ శ్రీను, లునవత్ కిసాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు నమోదు చేసుకోవాలి

- గతంలో ఓటు ఉన్నవారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.
- టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ వీరన్న నాయక్.

**మహబూబాబాద్, అక్టోబర్ 11 (జనం వాయిస్):**



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ, డాక్టర్ సెల్ నాయకులు డాక్టర్ వీరన్న నాయక్ పిలుపునిచ్చారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదైన వారు సైతం ఈసారి తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరన్న నాయక్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందిస్తారని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ విషయాన్ని గమనించి, 2026 నవంబర్ 6వ తేదీలోగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు అని, ఆ హక్కును వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉండటం తప్పనిసరి అని పేర్కొన్నారు. పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ద్వారా తమ ప్రతినిధిని ఎన్నుకోవడం వల్ల శాసనమండలిలో నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, పట్టభద్రుల సమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యంగా వైద్య విద్యను పూర్తి చేసిన వైద్యులు, ఇతర డిగ్రీలు పూర్తి చేసిన యువత, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు నమోదు ప్రక్రియలో పట్టభద్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ శ్రేణులు, డాక్టర్ సెల్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అర్హులైన తమ స్నేహితులు, సహోద్యోగులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ఏ ఒక్క పట్టభద్రుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదని డాక్టర్ వీరన్న నాయక్ స్పష్టం చేశారు.

# కొరవి వీరభద్ర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

## అమ్మవారి ప్రతిష్ఠాపన.. భక్తుల ప్రత్యేక పూజలు

**కురవి, అక్టోబర్ 11 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కొరవి మండల కేంద్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు తొమ్మిది రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాకార మండపంలో అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి, ధర్మకర్తలు దొంగల జనార్దన్ రెడ్డి, చిన్నం గణేష్, వెంపటి శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# దుర్గామాత ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న సింగరేణి జీఎం దంపతులు

**జనం వాయిస్, మందమర్రి: అక్టోబర్ 11**

మందమర్రి పట్టణంలోని వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో సింగరేణి జీఎం ఎన్. రాధాకృష్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతాచారి ఆహ్వానం మేరకు వారు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, డీసీసీ జనరల్ సెక్రటరీ పుల్లూరి లక్ష్మణ్, మాజీ పీసీసీ సభ్యుడు గుడ్ల రమేష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కనకం రాజు, మాజీ జిల్లా అధ్యక్షుడు సంఘీ సంతోష్, నెరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, రాచర్ల గణేష్, ఏడుకొల పవన్ కుమార్, కొలిపాక సదానందం, రాకం సంతోష్, పానుగంటి లక్ష్మణ్, ఎండీ చోటే మియా, గడ్డం శ్రీనివాస్, బత్తుల సతీష్, పెద్దిరాజు, మధుకర్, తిరుపతి, రాజమౌళి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు సాగర్, బియ్యపు రవి కిరణ్, మహంత్ అర్జున్, రాయబారపు కిరణ్, ముడారపు శేఖర్, ఎండీ జావిద్ ఖాన్, కంది ప్రదీప్, మెరుగు సతీష్, గణేష్, సాజన్, తరుణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# పదేళ్లు పూర్తి చేసుకున్న మహబూబాబాద్ జిల్లా

## కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ శ్రేణుల పాలాభిషేకం

**మహబూబాబాద్, అక్టోబర్ 11 (జనం వాయిస్):**

మహబూబాబాద్ జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాయి. జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు కృతజ్ఞతలు తెలుపుతూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2016 అక్టోబర్ 11న మహబూబాబాద్ నూతన జిల్లాగా ఏర్పడిన చారిత్రక సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా భూక్య రాంజీ షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మహబూబాబాద్‌ను నూతన జిల్లాగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో మహబూబాబాద్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు. జిల్లా ఏర్పాటుతో ప్రజలకు పరిపాలనా సేవలు మరింత చేరువయ్యాయని పేర్కొంటూ కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దపాటి వేణు, ఏర్పుల హుస్సేన్, షేక్ గౌస్, పోలేపొంగు సర్వయ్య, సదన బోయిన శ్రీకాంత్, గుండెపల్లి నవీన్, జింక ఎల్లయ్య, ఆదిముల ప్రతాప్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



# సూరంపేటలో భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన

## భక్తిశ్రద్ధలతో పూజలు.. అమ్మవారి ఆశీస్సుల కోసం ప్రత్యేక ప్రార్థనలు

**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 11:**

శాయంపేట మండలం సూరంపేట గ్రామంలో శ్రీ భవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో తొలిసారిగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.విగ్రహ దాత పావురాల రేణుక--సారంగం దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని సమకూర్చగా, శ్రీ దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూరం శశిపాల్ రెడ్డి, అడప ప్రభాకర్, చీర్ల సాయిరెడ్డి, పగడాల రాజుతోపాటు కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సన్న వడ్ల గుర్తింపునకు సాంకేతిక నిపుణుల నియామకం

## అగ్రికల్చర్ బీఎస్సీ, డిప్లొమా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం. అక్టోబర్ 15 చివరి తేదీ.. నెలకు రూ.15 వేల గౌరవ వేతనం.

**మహబూబాబాద్, అక్టోబర్ 11 (జనం వాయిస్):**



వానాకాలం 2026 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాల వడ్లను గుర్తించేందుకు సాంకేతిక నిపుణులను నియమించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అగ్రికల్చర్ బీఎస్సీ లేదా వ్యవసాయ డిప్లొమా పూర్తి చేసిన అర్హులైన యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 230 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించగా, వీటిలో 199 కేంద్రాలను సన్న రకాల వడ్ల కొనుగోలుకు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌కు అర్హత కలిగిన సన్న రకాల ధాన్యాన్ని గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో ఒక సాంకేతిక నిపుణుడిని నియమించనున్నట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ బీఎస్సీ లేదా వ్యవసాయ డిప్లొమా పూర్తి చేసిన ఔత్సాహిక యువతకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు నెలకు రూ.15,000 చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు విధానం :

అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన బీఎస్సీ అగ్రికల్చర్ లేదా వ్యవసాయ డిప్లొమా సర్టిఫికెట్ జతచేసి, మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల సమర్పణకు 2026 అక్టోబర్ 15 చివరి తేదీగా ప్రకటించారు. మరిన్ని వివరాల కోసం 9059474634 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు.

PRGI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# నల్ల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని.

**జనం వాయిస్ పాలకుర్తి అక్టోబర్ 11:**

దేవరుప్పుల మండలం, కోలుకొండ గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ నల్ల సత్యనారాయణ తల్లి ఇటీవల మరణించగా ఈరోజు పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించి నల్ల సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెరా అనిల్ కుమార్, జిల్లా నాయకులు తోటకూరి పాండు కృష్ణ, ఎస్సీ,బిసి,కిసాన్ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, కాడబోయిన గణేష్,గోపు సుధాకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, మండల నాయకులు రెడ్డి రాజుల రమేష్, తోటకూర రమేష్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్, నర్సింగరావు, ధనలక్ష్మి భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బిసు శ్రీనివాస్, దామెర పెద్దులు,మాజీ సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎర్రబెల్లి దయాకర్ రావు

**పాలకుర్తి అక్టోబర్ 11 జనం వాయిస్:**

ఆవిర్భావానికి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బైక్ ర్యాలీ ప్రారంభించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. జనగామ జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ పాలకుర్తిలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సందడి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పసునూరు నవీన్ మాచర్ల ఎల్లయ్య టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీరంనేని సోమేశ్వరరావు మండల నాయకులు కటారి పాపారావు బ్యాంకు వైస్ చైర్మన్ కారు పోతుల వేణు కారు పూతల వెంకటయ్య సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గడ్డం గడ్డం కిరణ్ పోషాల వెంకన్న జిల్లా యువజన నాయకుడు ఎర్రబెల్లి వినయ్ రావు భానోతి మహేందర్ నాయక్ మాజీ జెడ్పిటిసి పుష్కూరు శ్రీనివాసరావు కమ్మగాని నాగన్న ఉప సర్పంచ్ గాదపాక కిరణ్ వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు




# కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**జనం వాయిస్ పటాన్ చెరు,అక్టోబర్ 11:**

ముత్తంగి లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్‌లో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, భక్తిశ్రద్ధలతో గౌరమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రాజేష్ ఉపాధ్యాయులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ ప్రాంతంలో పండుగలకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తూ, బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు.



# లక్కారంలో ఘనంగా శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

### తొలి రోజు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**జనం వాయిస్, లక్కారం, అక్టోబర్ 11:**

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీ ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో లక్కారం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# సదరం సర్టిఫికెట్లకు రేటెంత..!?

- మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో ఏం జరుగుతోంది?
- 'నేనే రాజు.. నేనే మంత్రి' అన్న చందంగా క్యాంపులో ఆపరేటర్ల ఇష్టారాజ్యం?
- ఏజెంట్ల కనుసైగల్లో సర్టిఫికెట్ల జారీ జరుగుతోందా..?
- అంగవైకల్య శాతాన్ని బట్టి రేట్లు ఫిక్స్ చేస్తున్నారన్న ఆరోపణలు.
- వైద్య పరీక్షలు, రికార్డులపై సమగ్ర విచారణ జరిపితే వెలుగులోకి రానున్న వాస్తవాలెన్నో!

**మహబూబాబాద్, అక్టోబర్ 11 (జనం వాయిస్) :**

సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు జరుగుతున్నాయా..? అర్హతతో సంబంధం లేకుండా అంగవైకల్య శాతాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారా..? వైద్యుల పరీక్షలు కేవలం నామమాత్రంగానే సాగుతున్నాయా..? మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపుల చుట్టూ వినిపిస్తున్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఉద్దేశించిన సదరం ధ్రువీకరణ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు నిజమైతే, అర్హులైన దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## ఏజెంట్లదే తుది నిర్ణయమా..?

సదరం క్యాంపులో వైద్యుల పరీక్షల కంటే ఏజెంట్ల పాత్రే కీలకంగా మారుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, మధ్యవర్తుల మధ్య అనధికారిక ఒప్పందాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెంట్లు సూచించిన విధంగానే సర్టిఫికెట్ల ప్రక్రియ సాగుతోందని, వారి జోక్యం లేకుంటే అంగవైకల్య శాతం తక్కువగా నమోదు అవుతోందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.



## శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారా?

అంగవైకల్య శాతాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. 40 శాతం అంగవైకల్య ధ్రువీకరణ కోసం సుమారు రూ.10 వేలకుపైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండగా, శాతం పెరిగే కొద్దీ రేటు కూడా పెరుగుతోందని ప్రచారం జరుగుతోంది. అంగవైకల్యం తీవ్రత, వైద్యుల నిర్ధారణ, నిబంధనలకు బదులుగా డబ్బే ప్రామాణికంగా మారితే సదరం వ్యవస్థ లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. అయితే, ఈ వసూళ్ల ఆరోపణలకు సంబంధించి బాధితుల వాంగ్మూలాలు, చెల్లింపుల ఆధారాలు, ఇతర సాక్ష్యాలు సేకరించి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమని తేలకముందే సంబంధిత సిబ్బందిని లేదా వైద్యులను దోషులుగా నిర్ధారించడం సమంజసం కాదు.

## వైద్యుల పరీక్షలు నామమాత్రమేనా?

సదరం సర్టిఫికెట్ జారీలో వైద్యుల పరీక్షలే అత్యంత కీలకం. వ్యక్తి వైకల్య స్వభావం, తీవ్రతను వైద్య ప్రమాణాల ప్రకారం పరిశీలించి అంగవైకల్య శాతాన్ని నిర్ధారించాల్సి ఉంటుంది. అలాంటి ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం ఉందన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. నిజంగా వైకల్యం ఉన్నవారికి తగిన శాతం నమోదు చేస్తున్నారా? వైద్య పరీక్షల్లో గుర్తించిన అంశాలకూ, కంప్యూటర్‌లో నమోదైన వివరాలకూ పొంతన ఉందా? సర్టిఫికెట్ల జారీ వెనుక ఏదైనా అక్రమ వ్యవహారం నడుస్తోందా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

## రికార్డుల ఆడిట్‌తో నిజాలు బయటపడేనా?




మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో జారీ చేసిన సదరం సర్టిఫికెట్లపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యుల పరీక్షల రికార్డులు, రిజిస్టర్లు, కంప్యూటర్‌లో నమోదైన వివరాలు, సర్టిఫికెట్లలో పేర్కొన్న అంగవైకల్య శాతాలను పరస్పరం సరిపోల్చి పరిశీలించాలని సూచిస్తున్నారు. అవసరమైతే జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామాల స్థాయిలో లబ్ధిదారుల వివరాలను ధ్రువీకరించి, అనుమానాస్పద కేసులను గుర్తించి స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జిల్లా యంత్రాంగం స్పందించేది ఎప్పుడు?

దివ్యాంగులకు న్యాయం చేయాల్సిన సదరం వ్యవస్థలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకతను పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరోపణలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. అర్హతే ప్రామాణికమా? లేక డబ్బే నిర్ణయాత్మకమా? సదరం సర్టిఫికెట్ల జారీలో మధ్యవర్తుల పాత్ర ఎంత? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే సమగ్ర విచారణే మార్గం. ఆరోపణలు నిజమో కాదో తేల్చి, అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే.

# ఎర్రజెండా తోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయి.

- కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వం.
- తాళ్లపల్లి ఎంకన్న ప్రధమ వర్ధంతి పురస్కరించుకొని జెండా ఆవిష్కరించి నివాళులర్పించిన సిపిఎం.

**అక్టోబర్ 11 జనం వాయిస్ పాలకుర్తి:**



దేశంలో రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎర్రజెంతోనే పరిష్కారం అవుతాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు ఆదివారం పాలకుర్తి మండలంలోని దర్ద పల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన తాళ్లపల్లి వెంకన్న ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని వారి స్థూపం దగ్గర సిపిఎం జెండాను ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ వెంకన్న పార్టీ అనుబంధ సంఘం రైతు సంఘం లో చురుకుగా పాల్గొని వారని, పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉన్న నాయకుడు అతి చిన్న వయసులో చనిపోవడం బాధాకరమని. పార్టీ నిర్మాణానికి చాలా కృషి చేసేవారని ఏ బాధ్యత అప్పగించిన బాధ్యతగా నిర్వహిస్తూ ఉండేవారని అన్నారు, 2004 నాటి కేంద్ర ప్రభుత్వ సహాయం లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం 2005లో తేవడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమైందని, కార్మికులు రైతులు విద్యార్థి యువజన గిరిజన మహిళ హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంది సిపిఎం అని స్పష్టం చేశారు, కార్మిక వర్గంపై పెరుగుతున్న పని గంటల పెంపు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు, భారతదేశంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు, కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి మతతత్వం. కులతత్వం పెరిగిందని మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆర్ఎస్ఎస్ విధానాలతో దేశాన్ని వెనక్కి నేడుతుందని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేసి దాని స్థానంలో విబిజి గ్రాంజి పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ పేదలను తీవ్ర అన్యాయానికి గురి చేసిందని, రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రైతు వ్యతిరేక విత్తన విద్యుత్ సవరణ చట్టం పత్తి పంటపై ఉన్న ధీమతి సుంకాలను ఎత్తివేసి విదేశీయుల పత్తికి రెడ్ కార్పోరేట్ పరచడం, కనీస గిట్టుబాటు ధరల చట్టం తీసుకురాలేకపోవడం పంటల బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా మార్చకపోవడం దేశవ్యాప్తంగా రుణ విమోచన చట్టాన్ని తీసుకురావడంలో నిర్లక్ష్యం వ్యవహరించడం, రైతులను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, ఏదునూరి మదార్, మూస్కు ఇంద్రారెడ్డి,బెల్లి సంపత్, సీనియర్ నాయకులు సోమ అశోక్ బాబు, వేల్పుల కొమురయ్య, తోటరాజు, నిమ్మల పెద్దపురం, సాంబాజి, ఓగ్గుల కొమురయ్య, వారి కుటుంబ సభ్యులు తాళ్ల పెల్లి కుమారస్వామి, ఉప సర్పంచ్ బాలవేణి సోమయ్య, గిరగాని నరసయ్య, చిట్యాల మధు, గడ్డి రామచంద్రం, గబ్బెట శ్రీనివాస్, పూజారి రాజయ్య, తాళ్ల పెల్లి రాజు, తాళ్ల పెల్లి మదర్, దుంపల శ్రీను, పి యాకయ్య, వేల్పుల సొమ నరసయ్య, జి కృష్ణ, తాడం వీరన్న, తో పాటు వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి జ్ఞానగని అవార్డు

- హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా అవార్డు ప్రదానోత్సవం.
- జడ్జి బూర్గుల మధుసూదన్‌రావు చేతుల మీదుగా పురస్కారం.
- ఇప్పటివరకు 87 అవార్డులు, 149 వేదికలపై సన్మానాలు.

**జనం వాయిస్, ఖమ్మం, అక్టోబర్ 11:**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తికి జ్ఞానగని అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని లకిడీకాపూల్ రవీంద్రభారతిలో ఆర్కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్‌రావు చేతుల మీదుగా దివ్యమూర్తి అవార్డును అందుకున్నారు. ఆయన ప్రతిభను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి మాట్లాడుతూ జ్ఞానగని అవార్డు అందుకోవడం, సన్మానం పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకు తనకు 87 అవార్డులు లభించాయని, 149 వేదికలపై సన్మానాలు అందుకున్నానని తెలిపారు. తన ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన ఆర్కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రాజేంద్ర, రంజిత్, చందు ఆంజనేయులు, వీరభోగ వసంతరాయలు, డాక్టర్ గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




PRGI NO:TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల.

సోమవారం12 అక్టోబర్ 2026


నేత్రదానం చేసిన కుటుంబాలకు ప్రభుత్వ విప్

## విజయరమణ రావు సన్మానం

- సదాశివ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే.
- మరణానంతరం నేత్రదానం చేసిన వారి సేవలు అభినందనీయం.



2

సింగరేణి సంస్థను కాపాడుకునేందుకే

## బీఆర్ఎస్ పోరాటం.

- ఆనాడు కేసీఆర్ గ్లోబల్ సంస్థగా మార్చాలని చూస్తే.
- ఈనాడు జేబు సంస్థగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు.
- సంస్థ రాష్ట్ర వాటాలో 10శాతం అమ్మాలనే ఆలోచన చేస్తుండ్లు.
- కార్మికుల ప్రయోజనాల కోసం సింగరేణి కార్మిక గర్జన.
- మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్.

2




# కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం.
ధ్వజారోహణ మహోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.
పూలతో సుందరంగా ముస్తాబైన ఆలయం.
భక్తులకు అన్నదానం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, దాండియా కార్యక్రమాలు.



**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 11:**

కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయదశమి వేడుకల్లో - మిగతా 2 లో ...

# పద్మనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అడుగులు




అక్టోబర్ 17న పనుల ప్రారంభానికి ఏర్పాట్లు.
పది ఎకరాల్లో తిరుమల ఆలయాన్ని తలపించేలా రూపకల్పన.
టీటీడీ అధికారులతో స్థలాన్ని పరిశీలించిన గంగుల కమలాకర్.

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 11:**

కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ నెల 17న నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ - మిగతా 2 లో ...

# కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- మొదటి పేజీ తరువాయి ...



భాగంగా నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు నిర్వహించిన ధ్వజారోహణ మహోత్సవంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలిరోజు అమ్మవారి బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శక్తి, జ్ఞానం, ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీకగా భావించే బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధనకు నవరాత్రుల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. బాలరూపంలో అమ్మవారిని పూజించడం ద్వారా జీవితంలో మంచి విలువలను ఆచరిస్తూ జ్ఞానమార్గంలో పయనించాలనే సందేశం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఆలయానికి విచ్చేసిన భక్తులతోపాటు భవానీ దీక్షాపరులకు నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజూ ఈ సేవలను కొనసాగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో 'శ్రీ భాగవత వైభవం'పై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భక్తి పాటలతో దాండియా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. నవరాత్రులు ముగిసే వరకు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆలయంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి.

# నేత్రదానం చేసిన కుటుంబాలకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు సన్మానం




**జనం వాయిస్, ఓదెల, అక్టోబర్ 11:**

మరణానంతరం నేత్రదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన వారి సేవలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. ఓదెల మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదాశివ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**నేత్రదాతల కుటుంబాలకు సన్మానం**

సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరణానంతరం నేత్రదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ విజయరమణ రావు సన్మానించారు. నేత్రదానం ద్వారా అంధులకు చూపు లభించే అవకాశం ఉంటుందని, మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప సేవ నేత్రదానమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాల్లో ఫౌండేషన్ పాత్ర**

సదాశివ ఫౌండేషన్ 18 ఏళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సమాజంలో అవయవదానం, నేత్రదానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, సదాశివ ఫౌండేషన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పద్మనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అడుగులు

- మొదటి పేజీ తరువాయి ...

తెలిపారు. ఆదివారం టీటీడీ అధికారులతో కలిసి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, పనుల ప్రారంభానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. టీటీడీ పేరిట పది ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు గంగుల కమలాకర్ వెల్లడించారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో టీటీడీ అనుమతులు పొందినట్లు తెలిపారు. 2023 మే 31న భూమిపూజ నిర్వహించామని, అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ ఎన్నికల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని వివరించారు. తిరుమల ఆలయాన్ని తలపించేలా ప్రధాన ద్వారం, గర్భాలయం, అర్థమండపం, ముఖమండపం, గరుడాళ్వార్ తదితర నిర్మాణాలతో ఆలయాన్ని సంప్రదాయబద్ధంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 17న మూల నక్షత్రం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలలోపు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే



కరీంనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మరింత చేరువవుతుందని గంగుల కమలాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు గడ్డి ప్రదీప్ యాదవ్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, టీటీడీ ఏఈ నాగరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థను కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పోరాటం.

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 11:**

మన ప్రాంతాన్ని, మన సంస్థను కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ ఆలోచన అని, అందుకోసమే పోరాటం చేస్తున్నామని మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహ లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్థను బడేబాయ్ నరేంద్ర మోడీ చోటే బాయ్ రేవంత్‌రెడ్డి మిడిల్‌బాయ్ కిషన్‌రెడ్డి ముగ్గురు కలిసి సింగరేణిని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈనాడు తెరవెనుక చర్చలు జరుపుతూ సంస్థ 51శాతం రాష్ట్ర వాటాలో 10 నుంచి15శాతం అమ్ముదామా అనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. రెండేళ్ల కాలంలోనే సింగరేణి సంస్థను నాశనం చేశారని ఆయన వాపోయారు. గతంలో కేసీఆర్ సింగరేణి సంస్థను మరింత విస్తరింప జేయాలనే గొప్ప ఆలోచనతో సీఎండీని అనేక దేశాలు పంపించారని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే గొప్ప ఆలోచన చేశారన్నారు. సంస్థను గ్లోబల్ ఆర్గనైజేషన్ చేయాలని చూస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం జేబు సంస్థగా మార్చుకున్నారని, ఇందులో అందరూ వాటాదారులేని, ముఖ్యమంత్రితో సహా మంత్రులు శ్రీధర్‌బాబు అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లకు వాటా ఉన్నయి కనుకనే మాట్లాడుతలేరన్నారు. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన వారు ఎందుకు మాట్లాడుతలేరో అర్థం చేసుకోవాలన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడటం కోసమే బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ఇందులో భాగంగా ఈనెల 14న రామగుండం లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభ పెట్టినట్లు తెలిపారు. ఈ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసకువచ్చి కార్మికులకు మేలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మెడికల్ బోర్డు పెట్టలేదని, ఎవరైనా వెళ్తే వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 76జీఓ కింద



30వేల కుటుంబాలకు జాగలు ఇచ్చామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో జీఓ ద్వారా ఒక్కరికి పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కార్మికుల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చారని, అందులో ఒక్కటి అమలు చేయకుండా కార్మిక లోకాన్ని మోసం చేశారన్నారు. అంతేకాకుండా సింగరేణి సంస్థ లాభాల్లో గణనీయంగా వాటాలు ఇచ్చిన చరిత్ర కేసీఆర్‌దేనని, కానీ ఈనాడు లాభాల్లో వాటా చూపిస్తూ కోత విధిస్తున్నారని అన్నారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఈ క్రమంలో రామగుండంలో నిర్వహించే సింగరేణి కార్మిక గర్జనకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు!

**5 ఇంక్లైన్--విఠల్‌నగర్ మార్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.**

**నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే యువకులకు పోలీసుల కౌన్సెలింగ్.**

**జనం వాయిస్, గోదావరిఖని, అక్టోబర్ 11:**

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు హెచ్చరించారు. నగరంలోని 5 ఇంక్లైన్ నుంచి విఠల్‌నగర్ క్లబ్‌కు వెళ్లే మార్గంలో పార్కు మూలమలుపు వద్ద వన్‌టౌన్ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు రహదారి భద్రతపై పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ర్యాష్ డ్రైవింగ్ వల్ల వాహనదారులతోపాటు రహదారిపై ప్రయాణించే ఇతరులకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. యువత రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరగడమే కాకుండా చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రహదారి నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు.



# రెడ్‌క్రాస్ విజేతలకు గంగుల అభినందనలు

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 11:**

ఇటీవల నిర్వహించిన రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను శాలువాలు, పూల మొక్కలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించి, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని గంగుల కమలాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సంఘం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

- **ఈ నెల 14న రామగుండంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ.**
- **కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు.**
- **పోతిపెద్ది కిషన్‌రెడ్డి, గుజ్జుల రాజిరెడ్డి పిలుపు.**

**జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 11:**

ఈ నెల 14న రామగుండం ప్రాంతంలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ నిర్వహించనున్న ఈ సభకు



కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సింగరేణి ప్రాంత అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు, హక్కులకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి సభలు ప్రాధాన్యం కలిగి ఉంటాయని తెలిపారు. కార్మికుల సమస్యలపై జరిగే ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సింగరేణిని కాపాడాల్సిన అధికారులే అక్రమ కట్టడాలకు అండగా ఉంటారా?

**ఆర్జీ-3 జనరల్ మేనేజర్, ఎస్టేట్ అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు.**

**ప్రశ్నిస్తే నోటీసులు పంపిస్తారా?.. తప్పు చేయనప్పుడు భయమెందుకు?**

**ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి సస్పెన్షన్ లేఖలు ఎందుకిచ్చారో చెప్పాలి.**

**కార్మికులపై దాడులు జరుగుతుంటే ప్రైవేట్ వ్యక్తులకు మద్దతెందుకు?.**

**సీఎండీ, డైరెక్టర్ (పా)కు ఆధారాలతో ఫిర్యాదు చేస్తాం.**

**బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్.**

**జనం వాయిస్, పెద్దపల్లి, అక్టోబర్ 11:**

సింగరేణి సంస్థను కాపాడాల్సిన అధికారులే అక్రమ కట్టడాలకు అండగా నిలుస్తున్నారా? సంస్థ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అధికారులు రాజకీయ వ్యవహారాల్లో ఎందుకు తలదూరుస్తున్నారని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్, ఎస్టేట్ అధికారుల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ, వారి వ్యవహారశైలిపై సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పా)కు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సింగరేణి సంస్థ ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, వేలాది మంది కార్మికుల చెమటతో నడుస్తున్న సంస్థ అని గుర్తుచేశారు. అధికారులుగా ఉంటూ సంస్థ ప్రయోజనాలను, కార్మికుల హక్కులను విస్మరించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జనరల్ మేనేజర్‌కు రాజకీయాలపై అంత ఆసక్తి ఉంటే ఉద్యోగ బాధ్యతలను వదిలి రాజకీయాల్లోకి రావాలని శ్రీనివాస్ సవాల్ విసిరారు. ఆర్జీ-3 పరిధిలో అక్రమ నిర్మాణాలు, వాటికి



సంబంధించిన అనుమతులు, ఎస్టేట్ వ్యవహారాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై సంస్థ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థలో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న దొంగతనాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సింగరేణి అధికారులపై దాడులు జరిగినప్పుడు చట్టపరమైన కేసులు ఎందుకు నమోదు చేయలేదని, ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు మద్దతుగా నిలిచారని నిలదీశారు. నిజాలను ప్రశ్నిస్తే నోటీసులు పంపించడం ఎంతవరకు న్యాయమని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేయనప్పుడు భయమెందుకని, తాము చేస్తున్న ఆరోపణలు అవాస్తవమైతే ప్రజల సమక్షంలో సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. అవసరమైతే గుడిలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ముఖ్యంగా ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి సస్పెన్షన్ లేఖలు ఎందుకు ఇచ్చారని, వారు చేసిన తప్పేమిటో బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై ప్రైవేట్ వ్యక్తులు దాడులకు పాల్పడితే యాజమాన్యం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎవరైనా సంస్థలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తే ఇలాగే నోటీసులు పంపిస్తారా అని నిలదీశారు. సింగరేణి సంస్థ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆర్జీ-3లో అక్రమ నిర్మాణాలు, ఎస్టేట్ వ్యవహారాలు, సెక్యూరిటీ సిబ్బందిపై తీసుకున్న చర్యలు, అధికారులపై జరిగిన దాడుల అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అవసరమైన ఆధారాలతో ఉన్నతాధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసి, విచారణ పురోగతిని ప్రజల ముందుంచుతామని తెలిపారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడే వరకు, కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని మొలుమూరి శ్రీనివాస్ హెచ్చరించారు.

# సమాజ శ్రేయస్సు కోసం పాస్టర్ల త్యాగం గొప్పది

**విశ్వాసుల ఆత్మీయ ఎదుగుదలకు పాస్టర్ల సేవలు అమూల్యం.**
**ఐఎంఐ జనరల్ సెక్రటరీ అంకరి కుమార్.**
**సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్ దూడ మహేష్‌కు ఘన సన్మానం.**



**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 11:**

సమాజ శ్రేయస్సు కోసం, విశ్వాసుల ఆత్మీయ ఎదుగుదల కోసం పాస్టర్లు చేస్తున్న త్యాగాలు గొప్పవని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా (ఐఎంఐ) జనరల్ సెక్రటరీ అంకరి కుమార్ అన్నారు. ఆదివారం పాస్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు, సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ దూడ మహేష్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం అంకరి కుమార్ మాట్లాడుతూ దేవుని సేవలో నిరంతరం శ్రమిస్తూ, విశ్వాసులను సన్మార్గంలో నడిపించేందుకు పాస్టర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడంతో పాటు సమాజంలో ప్రేమ, శాంతి, ఐక్యతను చాటేందుకు పాస్టర్లు విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పాస్టర్ల సేవలను గుర్తించి ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలని పిలుపునిచ్చారు. 'మీ నాయకులను గౌరవించండి, వారు మీ ఆత్మలను కాయుచున్నారు' అనే బైబిల్ వాక్యాన్ని ఉటంకిస్తూ పాస్టర్ల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎం.కె. జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి సదానందం, రామగిరి కుమార్, ఈర్ల సదానందంతో పాటు విశ్వాసులు, స్త్రీల సమాజం నాయకులు, యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ సెలవుల్లోనూ తరగతులా?

- నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ డిమాండ్.

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 11:**



ప్రభుత్వం అక్టోబర్ 10 నుంచి 22 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్ ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే విద్యాసంస్థలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెలవులను వెంటనే అమలు చేసి విద్యార్థులకు చదువుల ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని యాజమాన్యాలకు సూచించారు. నిబంధనలు పాటించకపోతే సంబంధిత విద్యాసంస్థల ఎదుట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ముత్తారం రైతులకు సాగునీరు అందించాలి

**మాజీ ఎంపీపీ, లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి డిమాండ్**

**జనం వాయిస్, ముత్తారం, అక్టోబర్ 11:**



ముత్తారం మండలంలోని రైతుల పంట పొలాలకు వెంటనే సాగునీరు అందించాలని మాజీ ఎంపీపీ, లక్కారం సర్పంచ్ అత్తే చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి సాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్‌ను నింపి, అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా శుక్రంపేట రిజర్వాయర్‌కు నీటిని తరలించి నింపాలని చంద్రమౌళి సూచించారు. అనంతరం కాలువల ద్వారా ముత్తారం మండల రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. సరైన సమయంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగాన్ని ఆదుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీరు అందించకపోతే రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అత్తే చంద్రమౌళి హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందించడం ద్వారా పంటలను కాపాడాలని, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# మంథనిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**శ్రీ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు.**
**భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు..**
**ప్రారంభమైన భజనలు, అన్నదాన కార్యక్రమాలు.**

**జనం వాయిస్, మంథని, అక్టోబర్ 11:**

దసరా పండుగను పురస్కరించుకుని మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గర్భాలయంలోని అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఆలయంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను సైతం భక్తులు పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిరంతర భజన కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. మరోవైపు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలోనూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వివిధ ఆలయాల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలను జరుపుకుంటున్నారు. శ్రీ మహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వేద పండితులు మారుపాక ప్రశాంత్ శర్మ, వొజ్జల గణేష్ శర్మ, అవధానుల శ్రీనివాస్ శర్మ, ఆలయ ఈవో రాజ్ కుమార్, చైర్మన్ కనుకుంట్ల స్వామి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లా ఏర్పాటుతో ప్రజలకు ఎంతో ప్రయోజనం

**కేసీఆర్, హరీశ్‌రావు, రసమయి బాలకిషన్ చిత్రపటాలకు పాలాభిషేకం**

**జనం వాయిస్, బెజ్జంకి, అక్టోబర్ 11:**

సిద్దిపేట జిల్లా ఏర్పాటు ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని బీఆర్ఎస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా ఏర్పాటు సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల ఏర్పాటు ద్వారా పరిపాలన ప్రజలకు మరింత చేరువవుతుందని, ప్రభుత్వ సేవలు సులభంగా అందుతాయని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు జిల్లాల పునర్వ్యవస్థీకరణ దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం జిల్లాల ఏర్పాటు ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేయడంలో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, శ్రీనివాస్ గుప్తా, రామకృష్ణారెడ్డి, ఎల శేఖర్‌బాబు, బిగుల సుదర్శన్, చింతలపల్లి సంజీవరెడ్డి, నలవాల స్వామి, కొరివి తిరుపతి, కంటం శీను, వక్కల శ్రీనివాస్, పంతం శ్రీనివాస్, అన్నాడి సత్యనారాయణరెడ్డి, బండి రమేష్, కల్లూరి అజయ్, గుబురే మల్లేశం, రావుల రాజిరెడ్డి, రాధారం హరీష్, రాధారం రాయమల్లు, బాబు మియా, బామల్ల లక్ష్మణ్, దేవరాజ్, వంగల నరేష్, పెద్దన్న, సర్పంచులు భీమయ్య, తిరుపతిరెడ్డి, కాచు రాజయ్య, ముక్కిస తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, యాలాల పరశురాములు, బాల్‌రెడ్డి, మొండయ్య, మల్లేశం, పొట్లపల్లి శివ, బోనగిరి నవీన్, రామంచ పరశురాం, లింగాల శ్రీకాంత్, శంభు లింగారావు, కల్లూరి రవిబాబు, ధోనే లక్ష్మణ్, కొమిరె మల్లేశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# లక్కారంలో ఘనంగా శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**జనం వాయిస్, లక్కారం, అక్టోబర్ 11:**



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీ ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో లక్కారం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# మసకబారుతున్న కట్టెల పొయ్యి.. మరుగునపడుతున్న పల్లె జ్ఞాపకాలు!

- ఒకప్పుడు ఇంటింటా కట్టెల పొయ్యే.. నేడు గ్యాస్ స్టవ్‌లదే హవా.
- పొయ్యి మీద వండిన అన్నం.. కట్టెల మంటల్లో దాగిన అమ్మ చేతి కమ్మదనం.
- పొగతో కన్నీళ్లు పెట్టుకున్న అమ్మల కష్టాలకు సాక్ష్యం.
- మట్టి పొయ్యి నుంచి గ్యాస్ పొయ్యి వరకు మారిన పల్లె జీవన చిత్రం.
- ఆధునిక వంటగదుల్లో కనుమరుగవుతున్న ఆనాటి సంప్రదాయం.



**జనం వాయిస్, ప్రత్యేక కథనం, అక్టోబర్ 11:**

*ఆ పొయ్యి మంటల్లో అమ్మ కష్టం కనిపించేది.. ఆ పొగలో ఆమె కన్నీళ్లు కలిసిపోయేవి.. ఆ కట్టెల చిటపటల్లో కుటుంబం ఆకలి తీర్చే తపన వినిపించేది. తెల్లవారకముందే నిద్రలేచి ఇంటి ముందు కల్లాపి చల్లి, ముగ్గులు వేసి, వంటింట్లో కట్టెల పొయ్యి వెలిగించే అమ్మల కాలం క్రమంగా కనుమరుగవుతోంది. ఒకప్పుడు పల్లె జీవితానికి ప్రాణంగా నిలిచిన కట్టెల పొయ్యి నేడు జ్ఞాపకంగా మారుతోంది. గ్యాస్ పొయ్యిలు, విద్యుత్ వంట పరికరాలు అందుబాటులోకి రావడంతో మట్టి పొయ్యిలు మూలనపడుతున్నాయి. అయినా ఆ పొయ్యి మీద ఉడికిన అన్నం, కట్టెల మంటపై కాగిన పప్పు, మట్టి కుండలో వండిన కూరల జ్ఞాపకాలు పాతతరం మనుషుల మనసుల్లో ఇప్పటికీ పదిలంగానే ఉన్నాయి.*

తెలంగాణ పల్లెల్లో ఒకప్పుడు కట్టెల పొయ్యి లేని ఇల్లు దాదాపుగా కనిపించేది కాదు. ఇంటి మూలన మట్టితో తయారు చేసిన పొయ్యి ఉండేది. దాని పక్కనే ఎండిన కట్టెలు, పిడకలు, పత్తి కట్టెలు, చొప్పలు పేర్చి ఉంచేవారు. తెల్లవారుజామునే అమ్మ పొయ్యిలో కట్టెలు పెట్టి మంట రాజేసేది. మంట సరిగ్గా అంటుకోకపోతే ఊదుగొట్టంతో ఊదుతూ, కళ్లలోకి పొగ చేరినా లెక్కచేయకుండా వంట పూర్తి చేసేది. ఇంట్లో అందరి ఆకలి తీర్చడమే ఆమె లక్ష్యం. పొయ్యి వెలిగితేనే ఆ ఇంట్లో రోజు మొదలైనట్లు ఉండేది.

అప్పట్లో ఇప్పటిలా బటన్ నొక్కగానే మంట వచ్చే సౌకర్యాలు లేవు. వంట చేయాలంటే ముందుగా కట్టెలు సమకూర్చుకోవాల్సిందే. పొలాల గట్ల వెంట, చెట్ల కింద పడిన ఎండుకొమ్మలను ఏరుకొచ్చేవారు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు తలపై కట్టెల మోపుతో వచ్చే మహిళలు పల్లెల్లో నిత్యం కనిపించేవారు. వానాకాలంలో కట్టెలు తడిసిపోతే పొయ్యి వెలిగించడం పెద్ద సమస్యగా మారేది. తడి కట్టెలతో పొగ ఎక్కువగా వచ్చి వంటింట్లో కళ్లుమండేవి. అయినా కుటుంబం కోసం ఆ కష్టాలన్నింటినీ భరించేవారు.

కట్టెల పొయ్యిపై వండిన వంటకాలతో ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. మట్టి కుండలో ఉడికిన పప్పు, పొయ్యి మీద కాల్చిన జొన్న రొట్టెలు, సజ్జ రొట్టెలు, నిప్పుల మీద కాల్చిన వంకాయ పచ్చడి, పొయ్యి పక్కన వేడివేడిగా వడ్డించిన అన్నం.. ఇవన్నీ ఆనాటి పల్లె వంటింటి ప్రత్యేకతలు. కట్టెల మంటపై నెమ్మదిగా వండిన కొన్ని వంటకాలకు వచ్చే ప్రత్యేకమైన వాసన, రుచి ఇప్పటికీ చాలామందికి గుర్తుంటాయి. ఆ వంటల రుచి కేవలం పదార్థాల్లోనే కాదు.. అమ్మ చేతి వంటలో, కుటుంబమంతా కలిసి భోజనం చేసిన ఆనాటి అనుబంధాల్లోనూ దాగి ఉండేది.



*పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో కట్టెల పొయ్యిల సందడి మరింత ఎక్కువగా ఉండేది. సంక్రాంతి పండుగకు అరిసెలు, సకినాలు, ఇతర పిండివంటలు తయారు చేసేందుకు పెద్ద పొయ్యిలు వెలిగించేవారు. ఇంటికి బంధువులు వచ్చినప్పుడు పెద్ద గిన్నెల్లో అన్నం, కూరలు వండేవారు. ఇంటి ఆవరణలో పొయ్యిలు వెలిగించి వంటలు చేస్తుంటే పిల్లలు వాటి చుట్టూ తిరుగుతూ సందడి చేసేవారు. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి వంట పనుల్లో పాలుపంచుకునే ఆ దృశ్యాలు పల్లె సంస్కృతిలో భాగంగా ఉండేవి.*

అయితే కట్టెల పొయ్యి వెనుక కమ్మని జ్ఞాపకాలతోపాటు మహిళల కష్టాలు కూడా ఎన్నో ఉన్నాయి. పొయ్యి నుంచి వచ్చే పొగ కారణంగా కళ్ల మంట, దగ్గు, శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉండేది. గాలి సరిగా ప్రసరించని వంటగదుల్లో పొగ ఆరోగ్యానికి మరింత హానికరంగా మారేది. కట్టెల కోసం గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేది. వంట పూర్తయ్యే వరకు పొయ్యి దగ్గరే ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో గ్యాస్ పొయ్యిల రాక మహిళల శ్రమను తగ్గించడంతోపాటు పొగ నుంచి ఉపశమనం కలిగించింది.

కాలం మారడంతో పల్లె వంటగదుల రూపురేఖలే మారిపోయాయి. మట్టి పొయ్యి స్థానంలో గ్యాస్ స్టవ్ వచ్చింది. కట్టెల మోపుల స్థానంలో గ్యాస్ సిలిండర్లు చేరాయి. ఊదుగొట్టాల స్థానంలో లైటర్లు వచ్చాయి. పొగతో నిండిపోయే వంటగదుల్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు గంటల తరబడి సాగిన వంట పనులు ఇప్పుడు తక్కువ సమయంలో పూర్తవుతున్నాయి. అయినప్పటికీ కొన్ని గ్రామీణ కుటుంబాలు ప్రత్యేక వంటకాలు, పండుగల సందర్భాల్లో కట్టెల పొయ్యిలను ఉపయోగిస్తూనే ఉన్నాయి.

నేటి తరానికి కట్టెల పొయ్యి అంటే పాతకాలపు వంట సాధనం మాత్రమే కావచ్చు. కానీ నిన్నటి తరానికి అది ఎన్నో అనుభవాలకు నిలువెత్తు సాక్ష్యం. పొయ్యి దగ్గర కూర్చుని అమ్మ చెప్పిన కథలు, చలికాలంలో మంట కాచుకున్న ముచ్చట్లు, వేడివేడి జొన్న రొట్టెల కోసం ఎదురుచూసిన క్షణాలు, కుటుంబమంతా కలిసి భోజనం చేసిన రోజులు.. ఇవన్నీ కట్టెల పొయ్యితో ముడిపడిన తీపి జ్ఞాపకాలు.

ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం ఆహ్వానించదగ్గ పరిణామమే. మహిళలను పొగ బాధ నుంచి, కట్టెల సేకరణ కష్టం నుంచి విముక్తి చేయడం అవసరమే. అయితే ఆ మార్పుల మధ్య పల్లె జీవన విధానానికి గుర్తుగా నిలిచిన కట్టెల పొయ్యి చరిత్రను కూడా భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

***ఒకప్పుడు ఇంటి ఆకలి తీర్చిన కట్టెల పొయ్యి.. నేడు కాలగర్భంలో కలిసిపోతోంది. పొయ్యి మంటలు ఆరిపోయినా.. అమ్మ చేతి వంట రుచి, ఆమె పడిన కష్టం, ఆ మంటల చుట్టూ అల్లుకున్న అనుబంధాలు మాత్రం తరతరాల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.***

